## గ్రామాల్లో ఎమ్మెల్యే కృషితో లైట్లు

తాంసి(భీంపూర్), మే 8 : భీంపూర్ మండలంలోని గుబిడి, వడూర్ గ్రామాల్లో గురువారం రాత్రి హైమాస్ట్ లైట్లను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. లైట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్, దత్తు, సంజీవ్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

ఉట్నూర్, మే 8 : పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది విధుల పనితీరు, రికార్డుల నవీకరణ, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణ, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసులు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, సీఐ మొగిళి, ఎస్ఐ మనోహర్, సిబ్బంది ఉన్నారు.

## పంట మార్పిడితో రైతులకు మేలు

బోథ్, మే 8 : పంట మార్పిడితో రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పట్నాపూర్‌లో రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. యూరియా తక్కువగా వాడాలన్నారు. విత్తనాలు, మందులు కొనుగోలు చేసిన రసీదులను భద్ర పర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, షేక్ అబుద్ పాల్గొన్నారు.

## రైతులకు అన్నదానం

బోథ్, మే 8 : బోథ్ వ్యవసాయ మార్కెట్‌లో జొన్న పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులకు గురువారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పసుల చంటి, పోతారెడ్డి, చట్ల ఉమేశ్, గాజుల పోతన్న, అబుద్, అబ్రార్, గడ్డల నారాయణ, రహీమొద్దీన్, యూసుఫ్ అరుణ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి

నార్నూర్, మే8: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి అర్హులకే ఇండ్లు కేటాయించాలంటూ నార్నూర్ పంచాయతీ గ్రామస్తులు, బీజేపీ నాయకులు గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల పెత్తనంతో గ్రామ సభలు నిర్వహించకుండా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి అనుకూలంగా ఉన్నా వారికి ఇళ్లను కేటాయిస్తున్నారని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం ఆరోపించారు. డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్, ఎంపీడీవో జవహర్ లాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ బిక్కు, మాజీ మండలాధ్యక్షుడు ప్రకాశ్, పెసా కో ఆర్డినేటర్ రాథోడ్ సికిందర్, గ్రామస్తులు ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

ఇచ్చోడ, మే 8 : విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, ఎలాంటి కృత్రిమ కొరత లేకుండా చూడాలని మండల వ్యవసాయాధికారి భగత్ రమేశ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రైతు వేదికలో మండల టాస్క్ ఫోర్స్ టీమ్ ఆధ్వర్యంలో విత్తన డీలర్లకు, ఏఈవోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈవోలు తమ క్లస్టర్ పరిధిలో ఉన్న రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించాలన్నారు. రైతుల ఫిర్యాదు కోసం మండల టాస్క్ ఫోర్స్ సభ్యుల ఫోన్ నంబర్లు ప్రతి విత్తన దుకాణం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఉమెన్స్ ఎస్ఐ పద్మ, డీఏవో శ్రీధర్ స్వామి, ఏఈవోలు పాల్గొన్నారు.

## సీఆర్టీల రెన్యూవల్

ఉట్నూర్, మే 8 : ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమాల్లో పనిచేస్తున్న సీఆర్టీలను 2025–26 విద్యా సంవత్సరానికి గాను రెన్యూవల్ చేసినట్లు గిరిజన సంక్షేమశాఖ అధికారి విశ్వేశ్వర్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. సీఆర్టీలను ప్రతి సంవత్సరం విద్యాసంవత్సరానికి రెన్యూవల్ చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఈ విద్యాసంవత్సరం సీఆర్టీలు తమ విధులను జూన్ నుంచి నిర్వహించనున్నారు.

## 42 శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి

ఎదులాపురం, మే 8 : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42శాతం రిజర్వేషన్ బిల్ అమలు చేయాలని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ అన్నారు. బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీసీ మేలు కోలుపు రథ యాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. పూలే చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ప్రజా సంఘాలు, కుల సంఘాలు హాజరై మాట్లాడారు. విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలను కల్పించాలన్నారు. ఈ దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు సరైన అవకాశాలు లేక అన్ని రంగాల్లో వెనుకబడి అణగారిన వర్గాలుగా పేదవారుగా ఉన్నారని తెలిపారు. బీసీ మేల్కొల్పు రథయాత్రను ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో ఆయన స్వగ్రామంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాత్రకు స్థానిక సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, జక్కుల సత్యనారాయణ, తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, బీసీ ఆజాది ఫెడరేషన్ నాయకులు మాచర్ల శ్రీనివాస్, నామాని అర్జున్, స్థానిక కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఫేక్ ఐడీ క్రియేట్ చేసిన వ్యక్తి అరెస్ట్

గుడిహత్నూర్, మే 8: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తురత్ గోపాల్ ఓ మహిళ పేరుపై ఫేక్ ఐడీ క్రియేట్ చేసి పరువు తీయడంతో గురువారం కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఓ బాధితుడి సోదరి పేరుతో ఇన్‌స్టాగ్రామ్ నందు ఫేక్ ఐడీని క్రియేట్ చేసి వారి బంధువులు, మిత్రులకు ఆ మహిళపై చెడు ప్రచారం చేస్తున్నాడని పిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆదిలాబాద్ షీ టీం బృందం సాంకేతిక ఆధారాలతో గుర్తించి గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. మహిళలు సోషల్ మీడియాతో పాటు ఎక్కడైనా వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలన్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఎదులాపురం, మే 8 : ఆదిలాబాద్ పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ గురువారం తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ చౌక్ సమీపంలోని ఓ పాన్ షాప్ వద్ద గత రాత్రి మృతదేహం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లగా మృతి చెందిన వ్యక్తి తలకు పసుపు, గ్రీన్ కలర్ టవల్ తలకు చుట్టుకుని, కత్తా కలర్ ప్యాంట్ ధరించి ఉన్నారన్నారు. ఎవరూ గుర్తుపట్టకపోవడంతో రిమ్స్ మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. సంబంధికులు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

## రౌడీ షీటర్ రిమాండ్

ఎదులాపురం, మే 8 : ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్ ఖద్దును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఖద్దు వినాయక్ చౌక్ సమీపంలో తనను కులం పేరుతో దూషించి, కత్తితో దాడి చేశారని మహేశ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో ఖద్దుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. గురువారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

# సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


రక్తదాతలకు జ్యూస్ అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 8 : రక్తదానం ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా రక్తదానం చేసి ఆపదలో బాధితుల ప్రాణాలను కాపాడాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా కలెక్టర్‌కు రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ తో పాటు నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారిని అభినందించి పండ్ల రసాలను అందించారు. రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలిచిన వివిధ సంస్థల ప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... ఆపత్కాలంలో బాధితుల ప్రాణాలను కాపాడేలా రక్తదానం చేయాలన్నారు. రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించాలన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సంస్థలు శిబిరాలను నిర్వహిస్తూ సామాజిక స్పృహను చాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, అసోసియేట్ ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు, శ్రీరాం యువసేన, స్మైల్ సొసైటీ, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ, సేవా ఫౌండేషన్, తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉన్నారు.

**సదస్సులను సద్వినియోగం చేసుకోండి**

జైనథ్, మే 8 : భూ భారతి చట్టాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం భోరజ్ మండలంలోని హత్తిఘాట్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, గ్రామస్తులున్నారు.

**నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలి**

ఎదులాపురం, మే 8 : వచ్చే నెలన్నర పాటు గ్రామాల్లో తాగునీటి సరఫరాలో సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్, పంచాయతీ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అవసరం ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. పైప్‌లైన్లకు వెంటవెంటనే మరమ్మతు చేయాలని తెలిపారు.

**నీటి సరఫరాకు రూ.40 లక్షలు మంజూరు**

మున్సిపల్ పరిధిలో లాండా సాంగ్వి దగ్గర గల ఇన్‌టెక్‌వెల్ పంప్ హౌస్ నీటి సప్లై కోసం రూ.40 లక్షలు పరిపాలన అనుమతులు మంజూరుతోపాటు పనులు పూర్తి చేసి 11.5 ఎంఎల్డీ నీరందిస్తామని తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రవణ్, డీపీవో శ్రీలత, డీఎల్పీవో ఫణీంద్ర, మున్సిపల్ సిబ్బంది, డీఈ, ఏఈ, ఎంపీవోలున్నారు.

## ప్రేమ్‌సాగర్ కుటుంబానికి అండగా నిలుస్తాం

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మే,8: ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లిన నిర్మల్ జిల్లా సోన్ గ్రామానికి చెందిన ప్రేమ్‌సాగర్ ఇటీవల అక్కడ హత్యకు గురవడంతో తీవ్రవిషాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ భరోసా ఇచ్చారు. గురువారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో ప్రేమ్‌సాగర్ కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాధితులను ఓదార్చి వారికి తగిన ధైర్యం చెప్పారు. ప్రేమ్‌సాగర్ హత్య చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయం అవసరమైనా అందించేందుకు చర్యలు తీసుకుంటామని పిల్లల విద్య కోసం అన్ని విధాలా తోడుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రేమసాగర్ భార్య ప్రమీల, పిల్లలు, తల్లి లక్ష్మి, రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరి కమిటి సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల, తదితరులు ఉన్నారు.

**మెరుగైన వైద్యం కల్పించాలి**

నిర్మల్ చైన్‌గేట్, మే,8: జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించి, అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్, ప్రభుత్వ ప్రధాన దవాఖాన పర్యవేక్షకుడు గోపాల్ సింగ్, టీవీవీపీఎస్ సురేశ్, సౌమ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## జోగు రామన్నపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్

ఎదులాపురం, మే 8: పత్తి కొనుగోళ్లలో జరిగిన అవినీతిని ప్రశ్నించి రైతుల పక్షాన నిలబడిన మాజీ మంత్రి జోగు రామన్నను ఎమ్మెల్యే పాయల్ శంకర్ అవమానించేలా మాట్లాడడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. రైతులకు న్యాయం చేయాలన్న సదుద్దేశంతో పత్తి కొనుగోళ్ల అవినీతిపై ప్రశ్నించిన మాజీ మంత్రి జోగురామన్నను ఎమ్మెల్యే శంకర్ హేళన చేసే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. జోగు రామన్న రైతుల పక్షపాతిగా వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కష్ట సుఖాల్లో అండగా నిలబడుతున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనూ అన్నదాతల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పత్తి కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే అగౌరవంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ యాసం నర్సింగ్ రావు, చందాల రాజన్న, సేవ్వా జగదీశ్, ఇజ్జగిరి అశోక్, ఉగ్గే విఠల్, ముఖీమ్, సూర్య కాంత్ పాల్గొన్నారు.

## ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించండి

కడెం, మే 8: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని లింగాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. వారం రోజులుగా వర్షాలు, ఈదురుగాలులతో రైతులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ధాన్యాన్ని కేంద్రాల్లో ఉంచకుండా త్వరగా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో తప్ప, తరుగు పేరుతో అదనంగా తీసుకోవడం సరికాదన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రభాకర్, ఆర్ఐ సరిత, సిబ్బంది, నిర్వాహకులు, తదితరులున్నారు.

## కుక్కల దాడిలో జింకకు గాయాలు


జింకకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

భైంసా టౌన్,మే 8: మండలంలోని మాంజ్రి గ్రామ సమీపంలో గురువారం తాగునీటి కోసం వచ్చిన జింకపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని చికిత్స కోసం పశువుల దవాఖానకు తరలించారు. గాయాలు పూర్తిగా నయమయ్యాక అడవిలో వదిలేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

## బీజేపీలో వర్గ పోరు

తాంసి, మే 8 : బీజేపీ పార్టీ మండలాల కార్యవర్గ ఎన్నికను ముమ్మరం చేయగా తాంసి మండల అధ్యక్షుడి ఎన్నికలో వర్గ పోరుతో పంచాయతీ జిల్లా అధ్యక్షుడి చెంతకు చేరింది. గురువారం మండల కేంద్రంలోని స్థానిక రామాలయంలో బీజేపీ మండల నాయకులు మండల కార్యవర్గ ఎన్నికపై సమావేశం నిర్వహించారు. జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ వర్గీయుడు మండలంలోని కప్పర్ల గ్రామానికి చంద్ర కిరణ్, ఎంపీ గోడం నగేశ్ వర్గీయుడు వడ్డాడి గ్రామానికి చెందిన సిరిగిరి మహేందర్ మధ్య పోటీ నెల కొనడంతో ఇద్దరి మధ్య పంచాయతీ తెగక పోవడంతో చివరకు అధ్యక్ష ఎన్నికను జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ ముందుంచారు.

## సమ్మె నోటీసు అందజేత

నిర్మల్ అర్బన్, మే 8 : ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ టీయూసీఐ ఆధ్వర్యంలో గురువారం సోఫీనగర్ బీడీ కార్యాలయంలో ఫ్యాక్టరీ యజమానులకు సమ్మె నోటీసులు అందజేశారు. ప్రతి కార్మికుడూ ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇక్కడ సంఘ నాయకులు కిషన్, ఫోశెట్టి, రాజేందర్, లక్ష్మణ్, రవి, ఎల్లయ్య, గంగామణి, గంగాధర్ తదితరులున్నారు.

## అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కేసులు

ఎదులాపురం, మే 8 : ఆదిలాబాద్ పట్టణంలో ఫ్లెక్సీలు మున్సిపాలిటీ శాఖ అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. గురువారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజుతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఫ్లెక్సీ యాజమాన్యంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసే వారు మున్సిపాలిటీకి రుసుము చెల్లించి, సంబంధిత స్థలంపై అనుమతి పొందాలని సూచించారు. ప్రజలకు అభ్యంతరకరమైన పోస్టర్లు ఏర్పాటు చేస్తే ఏడాది జైలు, ఐదువేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బీ.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఉట్నూర్ రూరల్, మే 8: దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని దంతన్‌పెల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, సికెల్‌సెల్ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీలలో ప్రసవాలు పెంచాలన్నారు. ఈ హెచ్ఎంఎస్, ఈ సంజీవిని, టెల్ ఎంఏఎన్ఏ అమలులో సక్రమంగా పాల్గొనాలని సూచించారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

ఉట్నూర్, మే 8 : మండల కేంద్రానికి అనుకొని ఉన్న రామలింగంపేట్ శివారులోని ఆడే ధన్‌లాల్ వ్యవసాయ భూమిలో ఐదుగురు పేకాట రాయుళ్లని బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో ఉట్నూర్ ఎస్ఐ మనోహర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా జాదవ్ రమేశ్ ఇంద్రవెల్లికి చెందిన పెయింటర్, రాథోడ్ బలిరాం ఉపాధ్యాయుడు పులిమడుగు, జాదవ్ చంద్రకాంత్ ఉపాధ్యాయుడు ఉట్నూర్, జాదవ్ రమేశ్ ఐటీడీఏలోని డిప్యూటీ తహసీల్దార్ లక్కారం, జాదవ్ మహేందర్ డీఎం కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్లను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.13020తో పాటు ఐదు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. వీరిని పట్టుకున్నందుకు పోలీసులను ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ప్రత్యేకంగా అభినందించారు.

## యువతి అదృశ్యం

ఎదులాపురం, మే 8 : మహారాష్ట్ర నాందేడ్ మల్కాపూర్‌కు చెందిన యువతి అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ బీ. సునీల్ కుమార్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి గురువారం ఆదిలాబాద్‌లోని విద్యానగర్‌లోని సోదరి ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి మధ్యాహ్నం పట్టణంలోని కుమార్‌పేట్‌లోని సొంత అన్నయ్య ఇంటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## ఐటీడీఏ మాజీ చైర్మన్‌కు జాన్సన్ నాయక్ పరామర్శ


భీంరావ్‌ను పరామర్శిస్తున్న భూక్యా జాన్సన్‌నాయక్

ఇంద్రవెల్లి, మే 8 : ఉట్నూర్ ఐటీడీఏ మాజీ చైర్మన్ సిడాం భీంరావ్‌ను బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ గురువారం పరామర్శించారు. ఐటీడీఏ మాజీ చైర్మన్ సిడాం భీంరావ్ ఇటీవల కంటి శాస్త్ర చికిత్స చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నిరయోజక వర్గం ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ మండలంలోని పిట్టబొంగురం గ్రామానికి వెళ్లి సిడాం భీంరావ్‌ను పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు జిలానీ బేగ్, మడావి భీంరావ్, జాదవ్ ప్రకాశ్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, తదితరులు న్నారు.

**సూర్జాపూర్‌లో..**

ఖానాపూర్ రూరల్, మే 8 : ఖానాపూర్ మండలంలోని సూర్జాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మరెల్లి వేణు, నర్సింగరావు తండ్రి ఇటీవల స్వర్గస్తులు కాగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి పలికారు. ఆయన వెంట బక్కి కృష్ణ, బక్కశెట్టి అశోక్, భూసి నరేందర్, సంగ చిన్న గంగన్న, అనుప హరిశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**తాతమ్మ ఆలయంలో పూజలు**

ఖానాపూర్, మే 8: నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్ తాతమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు.

## నిర్మల్ గ్రామీణాభివృద్ధి శాఖకు అవార్డు


అవార్డు అందుకుంటున్న డీఆర్డీవో విజయలక్ష్మి

నిర్మల్ చైన్ గేట్, మే 8 : నిర్మల్ గ్రామీణాభివృద్ధి శాఖకు స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ రుణాల సద్వినియోగంతోపాటు రికవరీలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్ర స్థాయి అవార్డు వరించింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా నిర్మల్ డీఆర్డీవో విజయలక్ష్మి అవార్డు అందుకున్నారు. అవార్డు లభించడంపై అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్ కుమార్, డీపీఎం జ్ఞానేశ్వర్, ఏపీఎం సుదర్శన్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగమణి పాల్గొన్నారు.

## బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ అర్బన్/నిర్మల్ చైన్‌గేట్: మే 8 : వివిధ రంగాల్లో ఆవిష్కరణ సృజనాత్మకత సామాజిక సేవా పర్యావరణ, క్రీడలు తదితర రంగాల్లో ప్రతిభ చూపిన 5–18 సంవత్సరాల బాలబాలికలు,ప్రదాన మంత్రి బాల పురస్కారాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం ప్రకటనలో తెలిపారు.ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ టెక్నాలజి, వివిద రంగాలలో ప్రతిభ చూపిన 18 ఏళ్లలోపు బాలల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తులు గాని సంస్థలు గాని వెబ్ సైట్ http://awards.gov.in లో జూలై 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8247685975 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఇంటిని చర్చిలా నడుపుతున్నారని ఫిర్యాదు

లక్ష్మణచాంద, మే 8 : మండలంలోని కనకాపూర్‌కు చెందిన మైత్రి దయానంద్ తన ఇంటినే చర్చిగా మార్చి మత విద్వేషాలు తలెత్తేవిధంగా ప్రయత్నిస్తున్నాడని గ్రామస్తులు గురువారం ఎంపీడీవో రాధకు ఫిర్యాదు చేశారు. వీరిలో వీడీసీ సభ్యులు ప్రమోద్, భీమేశ్, హన్మండ్లు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ దర్శకుడిగా డా. వేణుగోపాలకృష్ణ


అవార్డు అందుకుంటున్న వేణుగోపాలకృష్ణ

నిర్మల్ చైన్‌గేట్, మే,8: నిర్మల్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు వేణు గోపాలకృష్ణ అవార్డు ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. 'ప్రేమతో నాన్న' అనే చిత్రం టాలీవుడ్ ఫిలిం ఫెస్టివల్‌కు ఎంపికకాగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈ చిత్రం ప్రత్యేకంగా ప్రదర్శించబడింది. గురువారం జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలకృష్ణ ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్నారు. టాలీవుడ్ దర్శకులు, అసోసియేషన్ నిర్వాహకులు మోహన్, ప్రముఖ దర్శకులు వీ.సముద్రశివ, దైవజ్ఞ శర్మ, నిర్మాతలు పద్మిని, మురళీధర్, విశ్రాంత జడ్జి మాల్యాద్రి, విశ్రాంత తహసీల్దార్ సత్యానందం చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఇంతకుముందు ఈ చిత్రానికి గాను డా. వేణుగోపాలకృష్ణకు, ఆయన కుమార్తె సహాసినికి 4 నంది పురస్కారాలు లభించాయి. కవిగా రచయితగా, లఘు చిత్రాల దర్శకుడిగా డా. వేణుగోపాలకృష్ణ పలుమార్లు ఉత్తమ అవార్డులు పొందారు. ఉత్తమ దర్శక అవార్డు లభించడంపై పలువురు వేణుగోపాలకృష్ణను అభినందించారు.

## ఆధునాతన వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

ముథోల్, మే, 8 : రైతులు ఆధునాతన వ్యవసాయంపై దృష్టి సారించి ఉత్తమ దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని వెంకటాపూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు మేరకే రసాయన ఎరువులు, పురుగుల మందులను వాడి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఏవో అంజి ప్రసాద్, వ్యవసాయ పరిశోధన స్థానం ముథోల్ ఏరువాక కేంద్రం అధిపతి నర్సయ్య, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, శాస్త్రవేత్తలు విజయ్ కుమార్, కార్తీక్, ఏవో రచన, నాయకులు నర్సాగౌడ్, తాటివార్ రమేశ్, పోతన్న, సుదర్శన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముథోల్, మే, 8 : మండలంలోని బ్రాహ్మణ్‌గావ్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సన్‌ఫ్లవర్ (సూర్యపూల) పంట కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. క్వింటాలుకు రూ.7280 మద్దతు ధర ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, నాయకులు సుదర్శన్, లక్ష్మీ నారాయణ, విట్టల్‌తో పాటు అధికారులు ఉన్నారు.

## నేడు 'డయల్ యువర్ డీఎం'

భైంసా, మే, 8 : పట్టణంలో శుక్రవారం ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం హరిప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామని ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలపై సెల్ నంబర్ 9959226005లో తెలియజేయవచ్చన్నారు.

## ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

దస్తురాబాద్, మే8 : మండలంలోని రేవోజీపేట గ్రామానికి రూ.20 లక్షలతో ఉప ఆరోగ్య కేంద్రం మంజూరు కాగా భవన నిర్మాణ పనులకు గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సత్తన్న, పుల్య నాయక్, ఎంపీడీవో రమేశ్, ఏఈ చందన్, ప్రత్యేకాధికారి సంధ్యా, పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్, నాయకులు రమేశ్ రావు, శరత్ రెడ్డి, కిషన్, రాజేందర్, రాజేశం, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

తానూర్, మే, 8 : వ్యవసాయదారులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని అదనపు వ్యవసాయ సంచాలకులు వినయ్ బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు రసీదులు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి మనిషా, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

## రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఖానాపూర్ రూరల్, మే 8 : భూమి ఉన్న ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఏఈవో రజిత తెలిపారు. ఖానాపూర్ మండలంలోని కొత్తపేట్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో రైతు పాస్‌పుస్తకాలను ఆన్‌లైన్ చేశారు.

## గంజాయి సాగుచేస్తున్న వ్యక్తి రిమాండ్

ఉట్నూర్, మే 8 : గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, ఉట్నూర్ ఎక్సైజ్ సీఐ రూప్ సింగ్ సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని నర్సాపూర్ జీపీలోని ఆడగూడ గ్రామానికి చెందిన ఆడ బాజీరావు తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు సాగుచేస్తున్నాడు. సమాచారం అందిన వెంటనే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. ఇందులో రూ.50వేల విలువైన తొమ్మిది మొక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారుఉ. బాజీరావుపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. రైతులు కాని, ఎవరైనా గంజాయి సాగుచేసినా, విక్రయాలు చేసినా, సరఫరా చేసినా కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ కానిస్టేబుల్స్ రవి, అశ్వక్, కానిస్టేబుల్స్ సందీప్, ఈశ్వర్, జమీల్, మేరి, ఉట్నూర్ ఎక్సైజ్ ఎస్ఐ మురళీ, సిబ్బంది ఆశన్న, స్రవంతి, గంగాధర్ పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారిపై కేసు

ఇంద్రవెల్లి, మే8 : అనుమతి లేకుండా మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో ఫైనాన్స్ పేరుతో వడ్డీ వ్యాపారం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చిన్నం ధర్మేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయన్న బుధవారం విలేకరులతో తెలిపారు. ఎస్ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అంబేద్కర్ కోనసిమ జిల్లాకు చెందిన చిన్నం ధర్మేందర్‌రెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలో ప్రతి బుధవారం, గురువారం అధిక వడ్డీ వ్యాపారంతో ఫైనాన్స్ నడిపిస్తూ వడ్డీ వ్యాపారం చేసి అమాయక ప్రజలను ఆర్థికంగా మోసం చేస్తున్నాడని సమాచారం అందింది. గురువారం సాయంత్రం ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా...ఫైనాన్స్ డబ్బులు వసూలు చేసి వస్తుండగా చిన్నం ధర్మేందర్‌రెడ్డి పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన చిన్నం ధర్మేందర్‌రెడ్డిని విచారించగా అతని వద్ద రూ.11,750, కొన్ని ఫైనాన్స్ చిట్టీలు, రిజిస్టర్లు దొరికినట్లు తెలిపారు. వాటితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## చౌకధరల షాపుల తనిఖీ

గుడిహత్నూర్,మే 8 : గుడిహత్నూర్ మండల కేంద్రంలోని చౌకధర షాపులను గురువారం జిల్లా పౌర సరఫరాల అధికారి వాజిద్ అలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ బియ్యం అమ్మిన వారి కార్డులను రద్దు చేస్తామన్నారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రేమ్‌నివాస్, డీలర్ శ్రీనివాస్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

By This deed I, The Under Signed **SHAIK ABDUL RAFIQ** S/o **SHAIK ABDUL HAMEED** R/o, 3-82,Taroda (Vill) R/M: Mudhole. Dist Nirmal and Telangana State. I Changed My name from **SHAIKH ABDUL RAFIQ ABDUL HAMEED** to **SHAIK ABDUL RAFIQ** S/o **SHAIK ABDUL HAMEED** For all future purpose

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

